రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు నగర పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన తమ కుటుంబాలు సమాజంలో నిరాదరణకు గురవుతాయని, ఆ ధోరణి వీడాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని పేర్కొన్నారు. ప్రతి వారం స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టాల్సిందేనన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అందాల తీరం.. అంతే ప్రమాదకరం!

- తిక్కవానిపాలెం తీరప్రాంతంలో గణేష్ నిమజ్జనాలపై నిషేధం
- ముత్యాలమ్మపాలెంలో అనువు మహోత్సవాలకు ఏర్పాట్లు
- గజ ఈతగాళ్ల సాయంతోనే విగ్రహాల నిమజ్జనం
- సముద్రంలోకి భక్తులకు ప్రవేశం లేదు

పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సముద్ర తీరాలు పర్యాటకులకు చాలా అనుకూలం. అందుకే సుదూర ప్రాంతాల నుంచీ ఇక్కడికి వస్తుంటారు. ఎక్కువగా యువత ఈ తీరప్రాంతాల్లో సముద్రపు కెరటాలతో సయ్యాటలాడేందుకు ఉత్సాహపడుతుంటారు. గణేష్ నిమజ్జన సమయంలో ఇది మరింత ఎక్కువ. ఈ ఉత్సాహం కొందరిని బలితీసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో గణేష్ నిమజ్జనాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరప్రాంతాలు సువిశాలం. చుట్టూ పచ్చని జీడిమామిడి తోటలు, బోటు షికారుకు అనువైన ఉప్పుటేరు, అతి పొడవైన ఎన్టీపీసీ జెట్టీ ప్రత్యేక ఆకర్షణలు. సెలవు దినాలు, పండగలు, జన్మదిన వేడుకలు చేసుకునేందుకు విద్యార్థులు, యువత, కుటుంబ సమేతంగా తీర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. గణేష్ నిమజ్జన సమయంలోనైతే చెప్పాల్సిన పనిలేదు. అర్ధరాత్రి వరకు ఆ సందడి తీరే వేరు.

పోలీస్ పర్యవేక్షణ నిల్!

గతంలో ఈ తీర ప్రాంతాల్లో పలు సంఘటనలు దృష్టిలో ఉంచుకొని పోలీసులు ప్రతి ఆదివారం ప్రత్యేక పర్యవేక్షణ చేసేవారు. సెలవు దినాల్లో నిర్వహించే పోలీస్ పర్యవేక్షణను గత కొంతకాలంగా నిలిపేశారు. దీంతో తీర ప్రాంతాలకు వస్తున్న యువత ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. చూడముచ్చటగా కనిపించే తిక్కవానిపాలెం తీరం కాస్త లోతుగా ఉంటుంది. పర్యాటకులు ఈ తీర ప్రాంతాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. గతంలో ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకున్న తీరం ప్రాంతం కూడ ఇదే కావడం గమనార్హం. దీంతో ఈ తీరంలో గణేష్ నిమజ్జనాలకు పోలీసులు అనుమతులీయలేదు.

గణేష్ నిమజ్జనాల్లో అప్రమత్తం

గత రెండు రోజుల నుంచి వినాయక నిమజ్జనాల కోసం మండల పరిధిలో అనేక గ్రామాల నుంచి భక్తులు ఈ తీర ప్రాంతాలకు విగ్రహాలు తీసుకొస్తున్నారు. నిమజ్జనం చేసే క్రమంలో భక్తులు సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు సరదా పడుతుంటారు. తీరంలో లోతు పాతులు తెలియని భక్తులు స్నానాలు చేసే సమయంలో రాకాసి అలల్లో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భద్రతా పరమైన చర్యలు చేపట్టారు.



ముత్యాలమ్మపాలెం తీరంలో పోలీసుల సమక్షంలో గణేష్ నిమజ్జనాలు

భక్తుల్ని లోపలికి అనుమతించం



ముత్యాలమ్మపాలెం తీరంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతాయి. అందుకే తీరంలో విద్యుత్ దీపాలు, పోలీస్ బందోబస్తుతోపాటు 50 మంది గజ ఈతగాళ్లను నియమించాం. తిక్కవానిపాలెం తీరంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను పూర్తిగా నిషేధించాం. నిమజ్జన సమయంలో భక్తులను సముద్రం లోపలికి వెళ్లకుండా గజ ఈతగాళ్ల మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకున్నాం. రాత్రి 12 తర్వాత నిమజ్జన కార్యక్రమాలు నిలిపివేస్తున్నాం.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

గణపతి సన్నిధిలో భారీ అన్నసమారాధనలు



శ్రమశక్తినగర్ భారీ గణపతిని దర్శించుకుంటున్న అదీప్‌రాజ్, మెంటి మహేష్, సంఘ ప్రతినిధులు



టీచర్స్ లేఅవుట్‌లో అన్నసమారాధన ప్రారంభిస్తున్న అదీప్‌రాజ్



రత్నగిరినగర్ మోరియా యూత్ ఆధ్వర్యంలో కొలువైన వినాయకుడి వద్ద సందడి

- వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, వివిధ పోటీలు
- పలు చోట్ల భారీ ఊరేగింపు మధ్య ఘనంగా నిమజ్జనాలు

పెందుర్తి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ టీచర్స్ లేఅవుట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతుల మీదుగా వడ్డన ప్రారంభించారు. దాదాపు 1500 మంది అన్నప్రసాదం స్వీకరించారు.

- శ్రమశక్తినగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపాన్ని అదీప్‌రాజ్ సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. పార్టీ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, శ్రమశక్తినగర్ ప్రతినిధులు రమణమూర్తి, సందీప్, దయానంద్, మదన్, ఎల్లాజీ, టీచర్స్ లేఅవుట్ ప్రతినిధులు వాడపల్లి మహేష్‌బాబు, అప్పారావు, మల్లువలస సన్ని, రాంబాబు, అల్లు ఈశ్వరరావు పాల్గొన్నారు.
- వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద సుమారు 600 మందికి అన్నసమారాధన జరిపారు. సాయంత్రం సందడిగా ఊరేగించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.
- సుజాతనగర్ సమీపంలోని రత్నగిరినగర్‌లో మోరియా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో 800 మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీ పెద్దలు, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కోట్నివానిపాలెం కాలనీలో గణపతి



ముత్యమాంబ కోలాట బృందానికి నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

రెండు వేల మందికి అన్నసమారాధన

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నసమారాధన జరిపారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కామేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలనీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిరంజీవిరావు, మాజీ కార్యదర్శి రామరాజు, కాలనీ యూత్ యశ్వంత్, మనోహర్, శేఖర్, కిషోర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సింహపురికాలనీలో అన్నసమారాధన చేస్తున్న అసోసియేషన్ నాయకులు, సింహపురి యూత్

పరవాడ: మండలంలో నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ ప్రజలు గణనాథుడిని దర్శించుకుని, పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా వినాయక మండపం వద్ద శ్రీముత్యమాంబ కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ముత్యమాంబ కోలాట బృందానికి రూ.15 వేల నగదు బహుమతిని మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి అందజేశారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం గణనాథుడిని ముత్యాలమ్మపాలెం తీరంలో డప్పువాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పైల మహాలక్ష్మి, కూండ్రపు సోమునాయుడు, కోలాట గురువు కె.మహాలక్ష్మి నాయుడు, యూత్ ప్రతినిధులు పైల కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

'సాయి హెల్పింగ్ హ్యాండ్స్'కు రాష్ట్రస్థాయి సేవా అవార్డు



ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను అవార్డుతో సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

పెందుర్తి: వైద్యం, రక్తదానం, నేత్రదానం, అవయవదానం అంశాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్‌కు ప్రజా సంకల్ప వేదిక సంస్థ 2025కు గాను రాష్ట్రస్థాయి సేవా రత్న అవార్డు–2025తో సత్కరించింది. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్‌కు ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు మదిరే రంగసాయిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో నిరుపేదలకు సేవలు అందిస్తామన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కూటమి కుట్రను తిప్పికొట్టాలి



గోవింద్ పట్నాయక్

పెందుర్తి: ఎన్నికల సమయంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగనివ్వబోమని నమ్మబలికి ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లు వేయించుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు ప్లాంట్ అమ్మకానికి సంపూర్ణ మద్దతు తెలపడం దుర్మార్గపు చర్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.గోవింద్ పట్నాయక్ మండిపడ్డారు. ప్లాంట్ ప్రైవేటీకరణపై కూటమి కుట్రను తిప్పి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఆదివారం వేపగుంటలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్టిగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. నాడు అధికారంలో ఉండి కూడా ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అనేక పోరాటాలు చేసిందన్నారు. అప్పటి సీఎం జగన్ ఒప్పుకోకపోవడం వలనే ప్లాంట్ ప్రైవేటీకరణ చేయలేదని లోక్‌సభలో స్వయంగా కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రకటన చేశారన్నారు. కానీ కూటమి నాయకులు నాడో మాట నేడో మాటతో ఉక్కు కార్మికులతో పాటు ఉత్తరాంధ్ర ప్రజలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులకు రంగులు వేస్తున్న సింహపురి కాలనీ నివాసితులు

సింహాచలం: 98వ వార్డు సింహపురికాలనీలో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాలనీలోని మహిళలు, చిన్నారులు తరలివచ్చి తమదైన శైలిలో రంగవల్లులను తీర్చిదిద్దారు. సింహపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ అనాథ మృతి



పెందుర్తి: పోలీసుల చొరవతో ఓ ఆశ్రమంలో సంరక్షణ పొందుతున్న ఓ అనాథ తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో తిరుగుతున్న ఓ వ్యక్తి(55)ని సంరక్షణ నిమిత్తం ఇటీవల స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. అతడికి శ్వాస సంబంధిత సమస్య రావడంతో ఈ నెల 22న కేజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. మృతుని వివరాలు, ఇతర సమాచారం తెలిసిన వారు 96767 97314 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.